నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, గురువారం 6 ఫిబ్రవరి 2025 | MEDAK

ఇదేనా ఇందిరమ్మ రాజ్యం

బీఆర్ఎస్ నాయకుల అరెస్టులపై హరీశ్‌రావు ఆగ్రహం

మెదక్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్ నాయకుల అరెస్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల పరిధిలో జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న స్థానిక ప్రజలు, రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేయడాన్ని హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు విషయంలో స్థానికుల అభిప్రాయాలను తుంగలో తొక్కుతూ ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. రైతులు, స్థానికుల ఆవేదనను కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎందుకు అర్థం కావడం లేదన్నారు. ప్రజలను, ప్రజాప్రతినిధులను అర్ధరాత్రి నుంచి ఎందుకు అక్రమ అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలిస్తున్నారని ప్రశ్నించారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో 144 సెక్షన్ విధించి, భయానక వాతావరణాన్ని సృష్టించారని, అప్రకటిత ఎమర్జెన్సీని ప్రకటించారని పేర్కొన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజలు, ప్రజాప్రతినిధులు అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పుకునే హక్కులేదా? ప్రజాపాలన పేరిట అధికారంలోకి వచ్చి, అప్రజాస్వామిక విధానాలు అనుసరించడం మీకే చెల్లిందని ఎద్దేవా చేశారు. అరెస్టు చేసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డితోపాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను విడుదల చేయాలని, డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలలో ప్రజలను చెదరగొడుతున్న పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు

డంపింగ్ యార్డు రగడ

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, ప్యారానగర్‌లో డంపింగ్ యార్డును వ్యతిరేకించిన స్థానికులు

- ప్రజలకు మద్దతుగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు
- ఎమ్మెల్యేతో సహా డంపింగ్ యార్డును వ్యతిరేకించిన నాయకుల అరెస్ట్
- నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో పోలీసు బలగాల మోహరింపు
- డంపింగ్ యార్డు వస్తే మా గ్రామాలు వల్లకాడే అంటున్న మహిళలు
- ఇప్పటికే పరిశ్రమల కాలుష్యంతో అనారోగ్యాలు..
- డంపింగ్ యార్డుతో కొత్త రోగాలు
- గుమ్మడిదల జాతీయ రహదారిపై రైతుసంఘాల నాయకుల ధర్నా, రాస్తారోకో
- జీహెచ్ఎంసీ అధికారుల పర్యవేక్షణలో అర్ధరాత్రి డంపింగ్ యార్డుకు రోడ్డు
- పోలీసుల వలయంలో డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాలు
- భయం గుప్పిట్లో 10 గ్రామాల ప్రజలు
- ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ రజాకార్ పాలనను తీసుకొచ్చిందని ఆగ్రహం



డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా చిద్రుప్ప జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గుమ్మడిదల మండలానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 5: సంగారెడ్డి జిల్లాలో డంపింగ్ యార్డు రగడ మొదలైంది. హైదరాబాద్ జవహర్‌నగర్‌లో ఉన్న డంపింగ్ యార్డులోని చెత్తను సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతానికి తరలించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించింది. దీంతో మంగళవారం రాత్రి అధికారులు, పోలీసులు గుమ్మడిదల మండలంలోని ముఖ్యనాయకులను అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. అర్ధరాత్రి నాయకుల ఇంటి తలుపులు తట్టి పోలీస్ వాహనాల్లో సంగారెడ్డి జిల్లాలోని చిద్రుప్ప పోలీస్ శిక్షణా కేంద్రానికి తరలించారు. దీంతో గుమ్మడిదల, బొంతపల్లి, దోమడుగు, అన్నారం, నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇంటింటికీ పోలీస్ బలగాలు రావడంతో ప్రజలు భయం గుప్పిట్లో కాలం గడిపారు. ప్యారానగర్, నల్లవల్లి డంపింగ్ యార్డును వ్యతిరేకిస్తూ మెదక్ జిల్లా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి నిరసన వ్యక్తం చేస్తూ నల్లవల్లి రాగా పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. గ్రామస్తులకు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డు వల్ల కాలుష్యం పెరుగుతుందని, రోగాలు పెరుగుతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇండ్లల్లో ఉన్న యువత, పురుషులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేస్తుండటంతో మహిళలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు వద్దని తీర్మానాలు చేసినా పోలీసులతో వచ్చి డంపింగ్ యార్డు ఏర్పాటుపై కాంగ్రెస్ సర్కార్‌పై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు.

అర్ధరాత్రి డంపింగ్ యార్డుకు రోడ్డు

ఒక్కసారిగా జీహెచ్ఎంసీ నుంచి వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా మట్టిని తీసుకొచ్చి ప్యారానగర్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డుకు రోడ్డు వేస్తున్నారు. వందలాది పోలీసు పహారాలో మట్టిని తెచ్చి రోడ్డును చదను చేస్తున్నారు. ఈ తంతును చూసిన స్థానికులు ఇదేం దుస్థితి అని నివ్వెర పోయారు. అటువైపు ఎవరు రాకుండా పోలీసు బలగాల మధ్య పనులు చేయిస్తున్నారు. పొలం పనులకు వెళ్తున్న వారిని కూడా నిలువరిస్తున్నారు. దీంతో ప్యారానగర్ అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డు వద్దని గుమ్మడిదల రైతు సంఘాల నాయకులు, యువకులు, ప్రజలు జాతీయ రహదారిపై ధర్నాకు దిగారు.

పోలీసు బలగాల మోహరింపు

జీహెచ్ఎంపీ ఏర్పాటు చేయనున్న డంపింగ్ యార్డు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ప్రజల నుంచి నిరసనలు, ఆందోళనలు జరగకుండా పోలీసు బలగాలను మోహరించారు. మైకుల్లో గ్రామాల్లో హెచ్చరిస్తూ ఎవరూ ఇండ్ల నుంచి బయటకు రావొద్దని హుకూం జారీ చేశారు. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు పోలీసుల తీరుతో పొలాల చాటున, పుట్టకొకరు, గుట్టకొక్కరు తలదాచుకున్నారు. అయినా పోలీసులు గాలిస్తూ ప్రజలను అరెస్ట్ చేశారు. ప్రజాపాలన పేరున పాలన చేపట్టిన కాంగ్రెస్ సర్కారు రజాకార్ పాలనను తీసుకొచ్చిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారుకు, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డంపింగ్ యార్డుతో తమ బతుకులు ఆగం చేయవద్దని ప్రజలు విజ్ఞప్తి చేశారు.

కొత్త రోగాలు ఖాయం

ఇప్పటికే పరిశ్రమల కాలుష్యంతో అనారోగ్యాల బారిన పడుతున్నామని, డంపింగ్ యార్డుతో కొత్త రోగాలు రావడం ఖాయమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్ యార్డును అడ్డుకొని తీరుతామని హెచ్చరిస్తున్నారు. పరిసర ప్రాంతాలు, పంట పొలాలు, పచ్చని అడవి, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని ప్రజలు వాపోతున్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటును వెంటనే వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ సర్కారును మండలంలోని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

యూరోపియన్ టెక్నాలజీతో యార్డు

యూరిపియన్ టెక్నాలజీతో ప్యారానగర్ అటవీ ప్రాంతంలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేస్తున్నామని జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ దుర్గాప్రసాద్, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతులతో నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు, సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవ్‌కుమార్, తహసీల్దార్ గంగాభవానితో కలిసి వెల్లడించారు. అక్టోబర్ 10న డంపింగ్ యార్డుకు అనుమతులు వచ్చాయని తెలిపారు. పీసీబీ ప్రపోజల్‌ను ఫిబ్రవరి 6, 2023లో అనుమతులు తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ డంపింగ్ యార్డును 150 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రోజూ 2 వేల టన్నుల చెత్తను హైదరాబాద్ జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నుంచి తరలించనున్నట్లు తెలిపారు. ఎలాంటి కాలుష్యం లేకుండా, కంపు రాకుండా యూరోపియన్ టెక్నాలజీతో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌కు చుట్టూ నాలుగు డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో ప్యారానగర్‌తో పాటు పటాన్‌చెరులోని లక్కడారంలో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయనున్నట్లు జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ తెలిపారు.

ప్రజలకు మద్దతుగా ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, రామచంద్రాపురం బీఆర్ఎస్ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, బొల్లారం నాయకుడు కొలను బాల్‌రెడ్డి, ఆర్సీపురం కార్పొరేటర్ తొంట అంజయ్య బుధవారం మధ్యాహ్నం నల్లవల్లి గ్రామానికి వచ్చారు. వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. మండల ప్రజల ప్రజాభిప్రాయం తీసుకోకుండా డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం అన్యాయమని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల ప్రజలతో కలిసి ఎమ్మెల్యే నిరసనకు దిగారు. వారిని పోలీసులు బీడీఎల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దంటూ కొత్తపల్లిలో యువకులు సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయకుండా అడ్డుకుంటామని కాంగ్రెస్ సర్కారును హెచ్చరించారు.

పోలీస్ వాహనంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని తరలిస్తున్న పోలీసులు

పొంచి ఉన్న ప్రమాదం

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

గుమ్మడిదల, ఫిబ్రవరి 5: డంపింగ్ యార్డుతో గుమ్మడిదలతో పాటు నర్సాపూర్, శివ్వంపేట మండలాల గ్రామాలకు ప్రమాదం పొంచి ఉందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో డంపింగ్ యార్డుకు అనుమతులు వచ్చినా ఏర్పాటు చేయవద్దని బీఆర్ఎస్ సర్కారు నిలిపివేసిందన్నారు. కానీ కాంగ్రెస్ సర్కారు కుట్రపూరితంగా ఈ ప్రాంతాన్ని కలుషితం చేయడానికి డంపింగ్ యార్డు ఏర్పాటుకు కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. డంపింగ్ యార్డు నర్సాపూర్ దిగువ ప్రాంతంలో ఉండడం వల్ల రాయిచెరువు, అడవులు, పరిసర ప్రాంతాలు కలుషితం అవుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శివ్వంపేటలో కూడా పర్యావరణం కలుషితం అవుతుందన్నారు. వ్యవసాయం చేయకుండా పొలాలు మారుతాయన్నారు. పచ్చని అడవికి విఘాతం కలుగుతుందన్నారు. భవిష్యత్‌లో ఈ మండలాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. గతంలో కోర్టుకు వెళ్లి స్టే తెచ్చామని తెలిపారు. స్టేటస్‌కో మెయింటేన్ చేయాలని చెప్పినా పోలీసులతో జులూం చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే రేవంత్‌రెడ్డి సర్కారు డంపింగ్ యార్డు ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ప్యారానగర్ డంపింగ్ యార్డు వద్ద పోలీసుల పర్యవేక్షణ

గుమ్మడిదలలో జాతీయ రహదారిపై డంపింగ్ యార్డు వద్దని ఆందోళన చేస్తున్న రైతు సంఘాల నాయకులు

పోలీసు వాహనంలో రైతులను, ప్రజలను తరలిస్తున్న పోలీసులు

గుమ్మడిదలలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న పలు గ్రామాల ప్రజలు

గుమ్మడిదలలో ప్రజలను తీసుకువెళ్తున్న పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు

గుమ్మడిదల మండలం ప్యారానగర్ గ్రామం వద్ద పోలీసుల మోహరింపు

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపు
- సిద్దిపేట జిల్లా కోహెడలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

కోహెడ ఫిబ్రవరి 5: త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని హుస్నాబాద్ మాజీఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని సింగరాయ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ మండల స్థాయి కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకొని వారికి అండగా నిలువాలని పిలుపునిచ్చారు. నాయకులంతా సమన్వయంతో పనిచేస్తూ స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగురడం ఖాయమన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్

ఈ సందర్భంగా వింజపల్లికి చెందిన గర్రెపల్లి వీరయ్య, పలువురు కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, ఫ్యాక్స్ చైర్మన్ పేర్యాల దేవేందర్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు పెరుగు నరేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొక్కుల సురేశ్, పొన్నాల లక్ష్మణ్, ఆవుల మహేందర్, తడ్కల రాజిరెడ్డి, భీంరెడ్డి రాజిరెడ్డి, పేర్యాల రాజేశ్వర్‌రావు, కొక్కుల రమేశ్, ఇప్పరపల్లి కృష్ణమూర్తి, అబ్దుల్ రహీం, తిప్పారపు నాగరాజు, జాలిగాం శంకర్, పోలవేని కుమారస్వామి గవ్వ వంశీధర్‌రెడ్డి, సుతారి కనుకయ్య, మంద సురేశ్, సంది శ్రీనివాస్ రెడ్డి, బండ వెంకటస్వామి తదితరులున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 5: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాసన మండలిలోకి కార్పొరేట్ శక్తులు సభ్యులుగా వెళితే ప్రభుత్వ ఉపాధ్యాయుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల మద్దతు తనకే ఉందన్నారు. కొంతమంది ప్రైవేట్ ఉపాధ్యాయులు ఓటు మేనేజ్‌మెంట్ ద్వారా డబ్బులు వెదజల్లి పదిహేను వేల ఓట్లును కొనాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ పరిణామాన్ని ఉపాధ్యాయులు గుర్తించాలని సూచించారు. ఈనెల 27న జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధ్యానత ఓటు వేసి తనకు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు యాదగిరి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

డీఆర్‌సీసీ, స్వచ్ఛబడి నిర్వహణ భేష్

సేంద్రియ ఎరువు తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న పట్టాభిరామ్, డాక్టర్ దశరథ్‌రామ్

- సిద్దిపేటను సందర్శించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్, సీఈవో

సిద్దిపేట కమాన్, ఫిబ్రవరి 5: సిద్దిపేట పట్టణంలోని డీఆర్‌సీసీ, స్వచ్ఛబడిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, డాక్టర్ దశరథ్‌రామ్(సీఈవో) బుధవారం సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ అశ్రిత్ కుమార్ వారికి పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. డీఆర్‌సీసీ నిర్వహణ తీరును కమిషనర్ వారికి వివరించారు. మున్సిపల్ చెత్త సేకరణ వాహనం ఉదయమే వార్డుల్లో ఇంటింటికీ వెళ్తూ చెత్త సేకరణ చేస్తారని, ప్రతి మంగళ, శుక్రవారం పొడి చెత్త, ఇతర వారాల్లో తడి చెత్తను సేకరిస్తారని తెలిపారు. ప్రజలు తడి, పొడి, హానికర చెత్తను అందించేలా ఇంటింటికీ సిబ్బంది వెళుతూ అవగాహన కల్పించారని తెలిపారు. తడి చెత్త ద్వారా బుస్సాపూర్ రిసోర్స్ పార్క్‌లో బయోగ్యాస్, సేంద్రియ ఎరువు తయారీ చేసి రైతులకు తక్కువ ధరలో విక్రయిస్తామన్నారు. బయోగ్యాస్‌ను పట్టణంలోని హరిత, అక్షయ వంటి హోటల్‌కు సరఫరా చేస్తున్నామన్నారు. పొడి చెత్తతో ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నామని చెప్పారు. డీఆర్‌సీసీలో పొడి చెత్త సేకరణ విధానం, సేకరించిన పొడి చెత్త విభజించు విధానం, పొడి చెత్తను కాంప్లెక్స్ చేసే విధానాన్ని వారు పరిశీలించారు. అనంతరం పట్టణంలోని స్వచ్ఛబడిలో డిజిటల్ తరగతి గదిలో ఇంటింటా చెత్త సేకరణ చేయు విధానం, పట్టణంలోని మౌలిక సదుపాయాల నిర్వహణ వంటి వాటిని ప్రొజెక్టర్ ద్వారా వీక్షించారు. స్వచ్ఛబడిలో ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి తయారు చేసిన ప్లాస్టిక్ టైల్స్‌ను పరిశీలించారు. స్వచ్ఛ బడిలో తడి చెత్త ద్వారా తయారవుతున్న సేంద్రియ ఎరువు తయారీ విధానం గురించి కమిషనర్ వివరించారు. అనంతరం సీడ్ బ్యాంక్, స్టీల్ బ్యాంక్, జూట్ క్లాత్ బ్యాంక్‌లను పరిశీలించారు. వారి వెంట కౌన్సిలర్ దీప్తీనాగరాజు, ఉమాకాంత్ (ఐటీసీ జీఎం) రాజు, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

రామాయంపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రామాయంపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

కేసీఆర్ హయాంలోనే ఆలయాల అభివృద్ధి

- ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
- రామాయంపేటలో వేంకటేశ్వరస్వామి పుష్కర ఉత్సవాలకు హాజరు
- ఆలయంలో వేర్వేరుగా ప్రత్యేక పూజలు

రామాయంపేట, ఫిబ్రవరి 5: తెలంగాణలో కేసీఆర్ హయాంలోనే ఆలయాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం రామాయంపేట పట్టణంలోని వేంకటేశ్వర స్వామి పుష్కర ఉత్సవాలకు హాజరై స్వామివారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వారు వేర్వేరుగా మాట్లాడుతూ తెలంగాణలో ఆలయాలు అభివృద్ధి చెందాయంటే అది కేవలం కేసీఆర్ వల్లేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రంలోని ఆలయాలు జీవం పోసుకున్నాయన్నారు. మెదక్ నియోజకవర్గంలోని మెదక్, రామాయంపేట, పాపన్నపేట, నిజాంపేట, చిన్నశంకరంపేట, నార్సింగి మండలాల్లోని ఆలయాలకు కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేశారని చెప్పారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వేర్వేరుగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పల్లె జితేందర్‌గౌడ్, పుట్టి విజయలక్ష్మి, పాతూరి ప్రభావతి, ఉమామహేశ్వర్, నర్సారెడ్డి, కన్నపురం కృష్ణాగౌడ్, నవాత్ కిరణ్, తోట లక్ష్మిపతి, కొప్పూరి లక్ష్మణ్, సంతోష్, ఏలూరి రవీందర్, చింతల రాములు, వెంకటేశం తదితరులు ఉన్నారు.